



ఈనాడు పార్వతీపురం మన్యం

మంగళవారం అక్టోబరు 8, 2024



గుచ్చిమి సమీపంలో ఏనుగుల గుంపు

జనావాసాల్లోకి కరిరాజులు

సీతానగరం, పార్వతీపురం గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: ఇన్నాళ్లు కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం మండలాల్లో సంచరించిన ఏనుగులు సోమవారం సీతానగరం మండలానికి చేరుకున్నాయి. గుచ్చిమి కొండల సమీపంలోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తాన్నసీతారాంపురం, పులిగుమ్మి, పుట్టూరు గ్రామాల మార్గంలోకి రావడంతో రాకపోకలు నిలిపేశారు. అంతకుముందు కరిరాజులు పార్వతీపురం మండలంలోని కవిటిభద్ర గ్రామంలో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి.

నేడు డయల్ యువర్ డీఎం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం డిపో పరిధిలో ప్రజా రవాణా సమస్యలపై మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో ప్రబంధకురాలు దుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమస్యలు, సూచనలను 99592 25621 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

రైతేరాజు 6లో

దరఖాస్తు చేద్దాం.. కలిసి కుమ్మేద్దాం..

అన్నా.. కుప్పలు తెప్పలుగా దరఖాస్తు చేస్తున్నారు.. లాటరీలో ఏ దుకాణం ఎవరికి వస్తుందో చెప్పలేం.. అదృష్టం బట్టి ఆధారపడి ఉంటుంది. నాకు వస్తే మిమ్మల్ని కలుపుకొని పోతా. మీకొస్తే నాకు పది పైసలు లోపే వాటా ఇవ్వండి చాలు. సరే తమ్ముడు.. ముందు దరఖాస్తు చేద్దాం.. ఆ తర్వాత దుకాణం ఎవరికొచ్చినా కలిసి చేసుకుందాం.

అన్నా.. చాలా మంది దరఖాస్తు చేస్తున్నారు.. ఎలా ఉంటుందో.. అది సరే.. నువ్వు ఎన్ని దుకాణాలకు దరఖాస్తు చేద్దామనుకుంటున్నావు.. మూడు దుకాణాలకు.. రూ.రెండేసి లక్షల చొప్పున మూడు డీడీలు తీసి ఇవ్వు.. అందరం కలిసి వేసుకుందాం.. ఆన్‌లైన్‌లో కదా.. ఎవరెవరు వేస్తారో మనకు తెలియదు.. ఎక్కువ మంది దరఖాస్తు చేసే అవకాశం ఉంది. మన తరఫున ఎక్కువ వేద్దాం. ఆపై మన అదృష్టం.. మనకే వస్తే కలిసి వ్యాపారం చేసుకుందాం..

- ఉమ్మడి జిల్లాలో మద్యం వ్యాపారుల మధ్య సంభాషణ ఇది.



ఈనాడు, పార్వతీపురం మన్యం

గత ప్రభుత్వం అయిదేళ్లు మద్యం దుకాణాలు సొంతంగా నడిపింది. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు రిటైల్ మద్యం దుకాణాలు లాటరీ ద్వారా కేటాయించనున్నారు. ఈనెల 12 నుంచి కొత్తవి అందుబాటులోకి వస్తాయి. ఇందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఒక వ్యక్తి ఎన్ని అయినా దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పోటెత్తుతున్నాయి. ఇంకా దీనికి రెండు రోజుల గడువు ఉంది. ఈ లోగా మరిన్ని దరఖాస్తులు రానున్నాయి.

రంగంలోకి పాత సిండికేట్లు

ప్రభుత్వ విధానం వెల్లడైన తర్వాత పాత సిండికేట్లు రంగంలోకి దిగారు. ముందు దరఖాస్తు చేద్దాం.. లాటరీలో మనకు దుకాణం దక్కితే కలిసి చేసుకుందాం.. అంటూ వ్యాపారులు కూడబల్కుంటున్నారు. గత ప్రభుత్వం విపరీతంగా ధరలు పెంచి అమ్మింది. కూటమి ప్రభుత్వం ఇప్పుడు తగ్గించి నూతన విధానం ప్రకటించింది. అమ్మకాలకు సంబంధించి ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో మన శక్తియుక్తులే వ్యాపారానికి ఆయువు.. అని అనుభవం ఉన్న వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వ మద్యం దుకాణం


గ్రామీణ దుకాణాలకు గిరాకీ

నగరం, పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలపైనే అందరి కళ్లు పడ్డాయి. అక్కడ ఎక్కువ వ్యాపారం సాగుతుందని వ్యాపారులు నమ్ముతున్నారు. వాటిని చేజిక్కించుకునేందుకు పోటీ పడుతుండటంతో అధిక దరఖాస్తులు వస్తున్నాయి. విజయనగరం జిల్లాలో 153 దుకాణాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 దుకాణాలకు లైసెన్సులు ఇవ్వనున్నారు. వీటిలో విజయనగరం జిల్లాలోనే ఇప్పటి వరకు అత్యధికంగా రికార్డు స్థాయిలో దరఖాస్తులు సమర్పించడం గమనార్హం. సగటున ఒక్కో దుకాణానికి పదికి పైగా దాఖలయ్యే అవకాశం ఉంది. ఎవరికి లాటరీలో తగిలినా కలిసి చేసుకుంటేనే నాలుగు రూపాయలు మిగులుతాయి.. లేకుంటే నష్టపోతామని ముందస్తుగా వ్యాపారుల సంభాషణల్లో వ్యక్తమవుతోంది. మద్యం వ్యాపారంలో గతంలో అనుసరించిన సహజ విధానాన్ని అవలంబించాలని నిర్ణయించారు.

సమావేశాలు.. సమాలోచనలు

మద్యం దుకాణాలపై సిండికేట్

గతంలో మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న సిండికేట్లు సమావేశాలు నిర్వహిస్తూ.. తమతో కలిసొచ్చే వారితో సమాలోచనలు చేస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మద్యం సిండికేట్ నడపడంలో దిట్టగా గుర్తింపు పొందిన వ్యాపారి ఒకరు ద్వితీయ శ్రేణి నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. బొబ్బిలి, రాజాం, పాలకొండ, సాలూరు, గజపతినగరం నియోజకవర్గాల్లో పాత వ్యాపారులే పోటీపడుతున్నారు. ఎంత మంది ఎన్ని దరఖాస్తులు సమర్పిస్తే అంత ఆదాయం ప్రభుత్వానికి చేకూరుతుందనే ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. దరఖాస్తు చేసుకోండి.. అదృష్టాన్ని పరీక్షించుకోండని.. చెబుతున్నారు. ఎస్.కోట, సాలూరు, పార్వతీపురం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన వారు కలిసి వ్యాపారం చేసుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. విజయనగరం నియోజకవర్గం పరిధిలో వైకాపా నాయకులకు తప్ప, కూటమి నాయకులకు పెద్దగా ఈ వ్యాపారంపై అనుభవం లేక ముందడుగు వేయాలా.. వద్దా.. అంటూ ఊగిసలాడుతున్నారు.



★ మన్యం జిల్లాలో అన్ని దుకాణాలకు దరఖాస్తు చేశారు. విజయనగరం జిల్లాలో గరివిడి మండలంలో ఓ దుకాణానికి (షాప్ 70) ఒక్క దరఖాస్తూ రాలేదు.

కల్పవల్లీ.. కామాక్షమ్మ



కుంకుమతో అలంకరణ

సాలూరులో కొలువుదీరిన కామాక్షమ్మ ఆలయంలో సోమవారం సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తల్లికి కుంకుమ రాసి, ప్రత్యేకంగా అలంకరించారు.

–న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతంపేట ఆసుపత్రి కిటకిట

సీతంపేట ప్రాంతీయాసుపత్రి సోమవారం రోగులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో రావడంతో ఓపీ విభాగం, వైద్యుల గదులు, రక్త పరీక్షల కేంద్రం వద్ద వరుసలు కట్టారు. 335 ఓపీ వచ్చిందని, వీరిలో 56 మంది జ్వరాల బారిన పడినట్లు వైద్యులు తెలిపారు. వాతావరణంలో మార్పులతో జ్వరాలు విజృంభిస్తున్నాయని ఆసుపత్రి ఇన్‌ఛార్జి పర్యవేక్షకురాలు ఉష తెలిపారు. – న్యూస్‌టుడే, సీతంపేట



నకిలీ విత్తనాలతో మోసం



కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: మక్కువ మండలంలోని గిరిజన రైతులకు నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయించి నష్టాలకు కారణమైన వ్యాపారులపై కేసులు పెట్టాలని వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండు చేశారు. సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. 15 మంది గిరిజన రైతులు 20 ఎకరాల్లో విత్తనాలు వేసి.. రూ.30వేల చొప్పున ఎకరాకు పెట్టుబడి పెడితే ఫలసాయం రాకుండా పోయిందన్నారు. వారికి పరిహారం అందేలా వాంగ్మూలాలు నమోదు చేసి సమర్పించాలని వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్‌కు కలెక్టర్ సూచించారు.

అన్నదాతకు ఎనలేని ప్రాధాన్యం

వర్షాలు, తుపాన్లకు తట్టుకుని.. తెగుళ్ల నుంచి బయటపడి.. చివరికి పంటను దక్కించుకున్నా కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే సవాలక్ష నిబంధనలు. తీరా అమ్మాక.. నగదు ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి సమస్యల నుంచి రైతులను గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇకపై కొనుగోలు దగ్గర నుంచి నగదు ఖాతాలో జమయ్యే వరకు అధికారులు తోడుగా ఉంటారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం

గతంలో కొనుగోలు సమయంలో రైతుకు, మిల్లరుకు సంబంధం ఉండేది కాదు. అమ్మిన ధాన్యం ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియని పరిస్థితి. ఈ సారి రైతుకు సమీపంలో, బ్యాంకు గ్యారెంటీ ఇచ్చే మిల్లుకే తరలించనున్నారు.

మిల్లుకో అధికారి..

ధాన్యం రవాణాకు వినియోగించే వాహనాలకు జియో ట్యాగింగ్ చేస్తారు. వాహనం కదలిక వివరాలు తెలుసుకునేందుకు ఈసారి ప్రతి మిల్లు పరిధిలో ఓ అధికారిని నియమిస్తారు. జిల్లాలోని 93 మిల్లులకు ఒక్కొక్కరిని చొప్పున ఉంటారు. వీరు పూర్తి వివరాలు సేకరించి అధికారులకు తెలియజేస్తారు.

మూడంచెల్లో పరిష్కారం..

రైతుల సమస్యలకు ఎక్కడికక్కడ పరిష్కారం చూపేలా మూడంచెల్లో సంయుక్త కమిటీలు ఏర్పాటు చేస్తారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఇవి పనిచేస్తాయి.

◆ గ్రామ స్థాయిలో వీఆర్వో, వ్యవసాయ సహాయకుడు, రైతు, మిల్లరు ప్రతినిధి, కలెక్టరు నియమించిన సభ్యుడు ఉంటారు.

◆ మండల స్థాయిలో తహసీల్దారు, ఏవో, రైతు, మిల్లరు, కలెక్టరు నియమించిన వ్యక్తి ఉంటారు.

◆ జిల్లా స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీతో పాటు మిల్లరు, రైతు, కలెక్టరు నియమించిన వ్యక్తి ఉండి కొనుగోలు, రవాణాలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై సంయుక్తంగా పని చేస్తారు.

రైతుకు మేలు కలిగేలా కొనుగోలు నిబంధనలు



వెంకంపేటలో సాగవుతున్న పంట


పెరిగిన మద్దతు ధర

గత ఖరీఫ్‌లో కొనుగోలు ధర కంటే ఈ సారి క్వింటా ధాన్యానికి రూ.117 ఎక్కువగా లభిస్తుంది. సాధారణ రకం క్వింటా రూ.2300, గ్రేడు ఎ-రూ.2,320గా నిర్ణయించారు. గత ఏడాది సాధారణ రకం- రూ.2,183, గ్రేడు ఎ- రూ.2,203గా ఉంది.

ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి: జిల్లాలో ఈ ఏడాది దిగుబడి బాగుంది. సగటున ఎకరాకు 22 క్వింటాళ్ల వరకు వస్తుందని అంచనా. దీనికి అనుగుణంగా వ్యవసాయ నివేదిక తయారు చేస్తున్నాం. కొన్నిచోట్ల 24 క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం ఉంది. - కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

ఇబ్బంది లేకుండా చూస్తాం: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. సమీపంలోని మిల్లులకు ధాన్యం పంపిస్తే చాలు. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు చెల్లించి సహకరించాలి. - శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ ప్రబంధకుడు

● జిల్లాలో రైతులు: 56 వేల మందికి పైగా.. ● సాగు విస్తీర్ణం: 1.70 లక్షల ఎకరాలు ● దిగుబడి అంచనా: 22 క్వింటాళ్లు (ఎకరాకు) ● జిల్లావ్యాప్తంగా: 37.40 లక్షల క్వింటాళ్లు





రహదారుల్లేని గ్రామాల్లో సర్వే

నివేదికలు ఇవ్వాలని కలెక్టరు ఆదేశం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి సౌకర్యం లేని గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారులు సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 105 అర్జీలు స్వీకరించారు. సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు



పింఛను పెంచండి సారూ..

ఈయన పేరు ఆర్.విజయకుమార్. సీతానగరం మండలం అప్పయ్యపేటకు చెందిన ఈయన మరొకరి సాయం ఉంటే కానీ బయటకు రాలేరు. పూర్తిస్థాయి దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.15 వేలు తనకు ఇప్పించాలంటూ మరొకరితో కలిసి ఆటోలో వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మహిళా సంఘాలకు యంత్రాలు



గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటికి చెందిన మహిళలు నవ్య, రమణమ్మ తదితరులు చిరు ధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లు, తినుబండారాలు కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. రస్తాకుంటుబాయి కేవీకేలో శిక్షణ పొంది వీటిని తయారు చేశామని, తమకు యంత్ర పరికరాలు అందజేస్తే స్వయం ఉపాధి పొందుతామన్నారు. సంబంధిత ప్రతిపాదనలు పంపించాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవను కలెక్టర్ ఆదేశించారు.

అధికారులకూ సమస్యలు..

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎదురవుతున్న పలు సమస్యలను వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, డ్వామా పీడీ రామచంద్రరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కుర్చీలు ఇబ్బందికరంగా ఉన్నాయని, జారిపోయే పరిస్థితి ఉందన్నారు. వాటిని మార్చాలని కోరారు. జిల్లా కార్యాలయాల సముదాయం ఉన్న ఆర్సీఎం పాఠశాలలోకి కాలువల్లోని నీరు వస్తోందని, నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

అరుదైన వ్యాధితో ఉపాధి దూరం



కొమరాడ మండలం మార్కొండపుట్టికి చెందిన ఎస్.ఉదయ్‌కుమార్ ఆక్యూట్ ట్రాన్స్‌వర్స్ మైలిటీస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. ఆంగ్లంలో బోధించ గల సామర్థ్యం ఉన్న ఆయన ముఖ్యమంత్రి నిర్వహించిన ప్రజా దర్బారులో అర్జీ ఇవ్వడంతో నెల్లూరు శ్రీసిటీలో ఉద్యోగావకాశం కల్పించారు. ఆరోగ్యం సహకరించక ఆ అవకాశం వదులుకోవాల్సి వచ్చిందని, జిల్లాలో ఉపాధి కల్పించాలని కలెక్టరును కోరారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం యశస్వి పథకం ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ ఏడాది చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 9, 10 విద్యార్థులు ఈ నెల 15, ఇంటర్మీడియట్ వారు 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుతోపాటు కుల, ఆదాయ, పాఠశాల, కళాశాల ధ్రువపత్రాలు పొందుపర్చాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించకూడదని సూచించారు.



పసర.. ప్రాణాలు తీస్తోంది



ఈ చిన్నారి పేరు సహస్ర. వయసు నాలుగు నెలలు. గుమ్మలక్ష్మీపురం మండలం మూల జమ్ముకు చెందిన బాలిక ఇటీవల జ్వరం బారిన పడటంతో గ్రామంలో పసర మందు ఇచ్చారు. అస్వస్థతకు గురవడంతో జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు సకాలంలో స్పందించి ప్రాణాలు నిలిపారు.

మన్యంలో వరుస ఘటనలు

గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం పట్టణం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పాము కాటుకు గురైనా, అనారోగ్యం బారిన పడినా, ప్రమాదాలు జరిగినా గిరిజనులు ఆసుపత్రులకు రాకుండా పసరు మందును ఆశ్రయిస్తున్నారు. ప్రతి గ్రామానికీ వైద్యం చేరువైనప్పటికీ.. నాటు వైద్యుల వద్దకే వెళ్తూ ప్రాణాలు తీసుకుంటున్నారు. సోమవారం కురుపాం మండలంలో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.

కొన్ని ఘటనలు ఇలా..

★ రెండేళ్ల క్రితం కురుపాం మండలం బారామనికి చెందిన నాలుగు నెలల చిన్నారి గ్రీష్మకు కడుపు నొప్పి రావడంతో పసరమందు పట్టారు. ఊపిరితిత్తుల్లోకి చేరడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

★ రెండేళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన బాలుడిని పాము కాటేసింది. ఏడాది పాటు పసర మందు వాడడంతో కాలు మొత్తం కుళ్లిపోయింది. తర్వాత జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. కాలు తొలగించారు.

★ ఏడాది క్రితం గుమ్మలక్ష్మీపురం మండలం అచ్చబలో నివాసముండే అయిదేళ్ల బాలిక అగ్ని ప్రమాదానికి గురవడంతో.. పొట్ట, ఛాతి, చేతులు కాలిపోయాయి. పసర మందు రాసి నెల పాటు ఇంట్లోనే ఉంచారు. పరిస్థితి విషమించిన తరువాత విషయం తెలుసుకున్న పోలీసులు చొరవచూపి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

★ మక్కువ మండలం ఆలుగూడకు చెందిన 8 నెలల శిశువుకు తరచూ కడుపు నొప్పి వచ్చేది. నాటు వైద్యుడిని సంప్రదించగా.. కడుపులో బల్ల ఉందని పొట్టపై వాతలు పెట్టాడు. పుండుగా మారడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అందుబాటులో వైద్యం..

మన్యం జిల్లాలోని 12 గిరిజన మండలాల్లో సుమారు 3 లక్షల మంది నివసిస్తున్నారు. ఏటా సుమారు 3 వేలు ప్రసవాలు జరుగుతున్నాయి. వీరికి అందుబాటులో గర్భిణుల వసతి గృహాలు, బర్త్ వెయిటింగ్ హాల్‌లు, 108 వాహనాలు ఉన్నాయి. గ్రామీణ ప్రజలకు అందుబాటులో 350 ఆరోగ్య ఉపకేంద్రాలు, 37 పీహెచ్‌సీలు ఏర్పాటయ్యాయి. కొండలపై నుంచి ఆసుపత్రికి చేరేలా ఫీడర్ అంబులెన్సులు నడుస్తున్నాయి. ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది నేరుగా గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తారు.

వైద్యులను సంప్రదించాలి..

ప్రస్తుతం గ్రామ స్థాయిలోనూ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అనారోగ్యానికి గురైన వారు సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. పసర మందు వాడి ప్రాణాలు తీసుకోవద్దు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– విజయపార్వతి, డీఎంహెచ్‌వో

నాటు వైద్యం వికటించి యువకుడి మృత్యువాత

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలం సీడిమానుగూడకు చెందిన ఆరిక మోహనరావు(26)ను మూడు రోజుల క్రితం పాము కాటేసింది. బాధితుడు పసరు వైద్యం తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఇంట్లో స్పృహ తప్పి పడిపోగా కుటుంబ సభ్యులు 108లో కురుపాం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఆయనకు భార్య శైలజ, రెండు నెలల కుమారుడు న్నారు. పసరు వైద్యం ఇంటిపెద్దను దూరం చేసిందని బాధితులు బోరున విలపిస్తున్నారు.

సమీకృత పంటలు.. మెండైన లాభాలు

రెండెకరాల విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండిస్తూ సీతంపేట మండలం దిబ్బగూడకు చెందిన రైతు బంట్రోతు శ్రీనివాసరావు ఆదర్శంగా నిలుస్తున్నారు. నాలుగేళ్లుగా సేంద్రియ పద్ధతులు అవలంబిస్తున్నారు. వివిధ పండ్ల జాతులు, కూరగాయలు, ఆకు కూరలు పండిస్తూ ఏటా రూ.3 లక్షల మేర ఆదాయం సంపాదిస్తున్నారు.

–న్యూస్‌టుడే, సీతంపేట



సాగు చేస్తున్న అరటి

సాగు విధానం ఇలా..

◆ అన్ని రకాల విత్తనాలు సొంతంగా తయారు చేస్తున్నారు. ◆ యంత్ర పరికరాల వినియోగం ఎక్కువ. ◆ ద్రవ, ఘన జీవామృతాలు, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, తూటికాడ కషాయం, పంచగవ్య తదితరాలు సొంతంగా తయారుచేసి వినియోగిస్తున్నారు. ◆ సౌర పథకం ద్వారా పొలానికి నీరు పారించడంతో విద్యుత్తు బిల్లు ఆదా అవుతుంది.

1.5 ఎకరాల్లో అరటి..

సొంతంగా తయారుచేసిన 600 అరటి విత్తులను 1.5 ఎకరాల్లో నాటారు. మొదటిగా 550కి పైగా గెలలు వచ్చాయి. పరిమాణం బట్టి రూ.250 నుంచి రూ.350 వరకు అమ్మగా రూ.1.75లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చు, ఇతర పెట్టుబడులు రూ.15వేలు పోగా...

సిరులు కురిపిస్తున్న జామ, మునగ..

అంతర పంటగా గుబ్బు 20 మునగ చెట్లు నాటారు. ప్రస్తుతం 300 కిలోలకు పైగా కాయలు దిగుబడి వచ్చాయి. కిలో రూ.50 చొప్పున రూ.15 వేలకు విక్రయించారు. గతంలో వేసిన 70 జామ చెట్ల నుంచి ఏడాదికి రెండుసార్లు కలిపి 700 కిలోలకు పైగా పంట చేతికొచ్చింది. కిలో రూ.30 చొప్పున రూ.21 వేలకు అమ్మకాలు చేపట్టారు.

కూరగాయలు, ఆకుకూరలు..

జామ, అరటి తోటల మధ్యలో బెండ, బీర, టమాట, వంగ, మిరప, క్యాబేజీ, ముల్లంగి, చిక్కుళ్లు, క్యారెట్, గోరుచిక్కుళ్లు, కరివేపాకు, ఆకుకూరలు, దొండ, గోంగూర, తోటకూర పండిస్తున్నారు. అనాస, సపోట, సీతాఫలం, బొప్పాయి, కొబ్బరి, జీడి నేరేడు, బంతి మొక్కలు ఉన్నాయి. వీటన్నింటి ద్వారా ఏడాదికి సుమారు రూ.లక్ష నుంచి రూ. 1.50 లక్షలు ఆదాయం సమకూరుతోంది.



అంతర పంటగా వేసిన అనాస



ఎక్కువ మంది ఆసక్తి..: పూర్తి సేంద్రియ విధానంలో సాగు చేయడంతో ఎక్కువ మంది కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. త్వరలో నాటుకోళ్లు, తేనె పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఏసీఆర్పీ బాలరాజు సూచనలు అందించారు. ప్రకృతి వ్యవసాయం హెడ్ విజయ్‌కుమార్ ఇటీవల పరిశీలించి సూచనలు ఇచ్చారు.

- బంట్రోతు శ్రీనివాసరావు, రైతు, దిబ్బగూడ

రైతేరాజు

సస్యరక్షణతో చీడపీడలు దూరం



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి పంటను కాపాడి ఆశించిన దిగుబడులు పొందవచ్చని భామిని వ్యవసాయాధికారి **సింహాచలం** తెలిపారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

? పత్తిలో సూక్ష్మలోపానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి.?

- వెంకటరమణ, రావివలస

☛ లీటరు నీటికి మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు, బొరెక్స్ 3 గ్రాములు కలిపి మొక్క మొదట్లో పిచికారీ చేయాలి. దీంతో పూత, పిందె రాలకుండా ఉంటుంది. తీవ్రత అధికంగా ఉంటే సమీప వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించాలి.


? అపరాల్లో విత్తనశుద్ధి ఎలా.? **- రామినాయుడు, బత్తిలి**

☛ అపరాల్లో విత్తనశుద్ధి చేస్తే చీడపీడలు సోకే అవకాశం తక్కువగా ఉంటుంది. లీటరు నీటిలో 5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేస్తే 15 నుంచి 20 రోజుల వరకు రసం పీల్చే పరుగుల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చలికాలం సమీపిస్తున్న తరుణంలో జీవాల పెంపకంలో ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేగ దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాల కోసం 94943 25693 నంబరును సంప్రదించాలని గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి లక్ష్మణరావు తెలిపారు.

అప్రమత్తతతో పత్తిని కాపాడుదాం



కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు తెల్ల బంగారంలా భావించే పత్తి పంటను ఇటీవల పురుగులు ఆశించి ఎదుగుదల, దిగుబడిని దెబ్బ తీస్తున్నాయి. ఆకులు అడుగు భాగంలో గుడ్లు పెట్టి పిల్ల, తల్లి పురుగులు రసం పీల్చడంతో ఆకులు వడలిపోతాయి. పేనుబంక, పచ్చ, తెల్ల దోమలు, తామర, పిల్ల, తల్లి పురుగులు ఉంటే యాజమాన్య చర్యలు చేపట్టాలని రస్తాకుంటుబాయి కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డా.జి.అమృతవీణ సూచించారు. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.9 ఎస్.ఎల్.0.4 మి.లీ లేదా ఎసిటామిపిడ్ 20 ఎస్.పి 0.2 గ్రాములు లేదా థయోమిథాక్సిమ్ 25 డబ్ల్యూజీ 0.2 గ్రాములు లేదా డైఫెన్ థయరాన్ 50 డబ్ల్యూ.పి 1.25 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

చిరుపొట్ట దశలో జాగ్రత్తలు అవసరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో వరి చిరు పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పంటలను రక్షించుకునేందుకు సిఫార్సు చేసిన మందులు పిచికారీ చేయాలని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.జి.అమృతవీణ సూచిస్తున్నారు. ★ కాండం తొలుచు పురుగు మొవ్వను తినేస్తుంది. పూతదశలో కంకి తాలుగా మారుతుంది. దీనికోసం ముందస్తుగా పిలక దశలో ఎకరాకు 10 నుంచి 12 కిలోల కార్బోఫ్యూరడాన్ 3జీ గుళికలు లేదా 4 కిలోల క్లోరాన్‌ట్రానిలిప్రోన్ లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలి. ★ దుబ్బు కుళ్లు తెగులు ఆశిస్తే కంకి పాలు పోసుకునే దశలో కాండం లోపల కణుపుల మధ్య భాగం నల్లగా మారుతోంది. దీని నివారణకు హెక్సాకొనజోల్, వాలిడామైసిన్ మందు సరిపడా నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ★ కంకి దశలో ఎండాకు తెగులు కనిపిస్తుంది. ఆకుల చివర్ల నుంచి మధ్య వరకు పసుపుపచ్చ మచ్చలు ఉంటాయి. పొటాష్ ఎరువు వేయాలి. ప్లాంటోమైసిన్, కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



మోసాలపై 11 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 48 వినతులు అందాయి. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత అర్జీదారులతో మాట్లాడారు. భూ తగాదాలకు సంబంధించి 21, కుటుంబ కలహాలపై 3, మోసాలపై 11, ఇతర సమస్యలపై 13 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి వారం రోజుల్లోగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్లను ఎస్పీ ఆదేశించారు. ఎస్బీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వ్యతిరేకంగా కలెక్టరేట్ ముట్టడి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కమిషనర్ నల్లనయ్య వ్యవహారశైలిపై ఫిర్యాదు చేసేందుకు తరలి వచ్చారు. ఆయన ప్రవర్తన అమానుషంగా ఉందని, సెలవు దినాలు, ఆదివారాల్లో విధులకు హాజరవ్వాలని ఆదేశిస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత దూషణలు చేస్తూ అవమానపరుస్తున్నారని వాపోయారు. ప్రతి విషయానికీ ఛార్జి మెమో, షోకాజ్ నోటీసులు ఇస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఓ కార్యదర్శి స్పృహ కోల్పోయి పడిపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. అనంతరం జేసీ సేధు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.



10 నుంచి అఖిల భారత డ్వాక్రా బజారు

విజయనగరం అయ్యన్నపేట/మయూరికూడలి, న్యూస్‌టుడే: పైడితల్లి సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ట్యాంకు బండ్ రహదారి వద్ద డ్వాక్రా బజారును ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. సుమారు 250 స్టాళ్లతో పాటు ఫుడ్ కోర్టు ఏర్పాటు కానుందని, బృందాలుగా ఏర్పడి పర్యవేక్షించాలన్నారు. సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ సూచించారు. సోమవారం జిల్లా క్రీడా ముఖ్య శిక్షకుడు వెంకటేశ్వరరావు ఆయనను కలవగా.. పలు సూచనలు చేశారు. నైపుణ్యమున్న విలువిద్య క్రీడాకారులున్నారని, మరింతగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతిభావంతులను ఎంపిక చేసి జాతీయ స్థాయి క్రీడలకు పంపించాలని చెప్పారు.

అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బావిలో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ వివరాల మేరకు.. దేవాంగుల వీధికి చెందిన ఎన్.మృత్యుంజయరావు(70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యుల వద్దకు వెళ్లినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మేదరబంద వద్ద ఉన్న బావిలో పడి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం ఉదయం స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతని కుమారుడు రామచంద్రమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఇంటిపెద్ద ఆత్మహత్య

పీఎంపాలెం(విశాఖపట్నం), న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. పార్వతీపురం సమీపంలోని వేమకోటవారివీధికి చెందిన కె.అప్పలనాయుడు(38) నెల రోజుల క్రితం మధురవాడ ప్రాంతానికి కూలి పనుల నిమిత్తం వెళ్లాడు. మద్యానికి బానిసైన ఆయన అనారోగ్యం కారణంగా ఇటీవల స్వగ్రామానికి తిరిగొచ్చి.. రెండు రోజుల క్రితం మళ్లీ వెళ్లాడు. ఆదివారం అర్ధరాత్రి బక్కన్నపాలెం వెళ్లే దారిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిడుగు పడి మహిళ దుర్మరణం

ఆరుగురికి గాయాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో ఓ మహిళ మృతిచెందగా ఆరుగురికి గాయాలైన ఘటన గజపతినగరం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణరావు వివరాల మేరకు.. గజపతినగరం మండలం కొత్త శ్రీరంగరాజపురానికి చెందిన బి.అప్పలమ్మ(54) తన పొలంలో దత్తిరాజేరు మండలం గడసాం గ్రామ కూలీలతో కలుపు మొక్కలు తీయిస్తుండగా మేఘాలు కమ్ముకోవడంతో అందరూ చెట్టు కిందకు వెళ్లారు. అక్కడ కూర్చొని భోజనం చేస్తున్న తరుణంలో చెట్టుపై పిడుగుపడి అప్పలమ్మ చనిపోయింది. ఆమెతోపాటు ఉన్న కూలీలు ఆదిలక్ష్మి, పైడిరాజు, సుశీల, మంగమ్మ, రమణమ్మ, లక్ష్మి గాయపడ్డారు. గ్రామస్థులు వీరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో కార్మికుడి మృత్యువాత

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన శృంగవరపుకోట పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ నారాయణమూర్తి వివరాల ప్రకారం వేపాడ మండలం పెదగుడిపాల గ్రామానికి చెందిన ఎం.గణేష్(35) గ్రామస్థులతో కలిసి పెయింటింగ్, పుట్టీ పనులకు ఎస్.కోట వచ్చారు. ఆదివారం రాత్రి తోటి కార్మికులతో కలిసి భోజనం చేసి.. విశాఖ- అరకు రోడ్డులోని నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తులో నిద్రించారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తోటి కార్మికులు చూసేసరికి భవనం కింది అంతస్తులో విగతజీవిగా పడిఉన్నాడు. అతని భార్య సంతోషి ఫిర్యాదు మేరకు ఎస్సై గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

7,700 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన సరకుతో అధికారులు

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థలో సరఫరా చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలను సీజ్ చేసినట్లు విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంటు అధికారి బి.సింహాచలం తెలిపారు. సోమవారం మండలంలోని కాశాపేట, చినభోగిల, అప్పయ్యపేటలో తనిఖీలు చేస్తుండగా మూడు వాహనాల్లో తరలిస్తున్న 7,700 కిలోల బియ్యం పట్టుబడినట్లు చెప్పారు. సరకుతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బొబ్బిలి మండలం పిరిడి, కమ్మవలసకు చెందిన పలువురు స్థానికంగా కొనుగోలు చేసి ఒడిశాలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సీఎస్ డీటీ రమేష్‌బాబు, వీఆర్వోలు కుమారస్వామి, నాగమణి, సింహాచలం ఉన్నారు.

రైలు ప్రమాదంలో కూలీ మృతి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: బెలగాం రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ఘటనలో కూలీ మృత్యువాత పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు చెందిన బాలకృష్ణ(37) ప్రైవేటు కాంట్రాక్టర్ల వద్ద కూలి పనులు చేస్తుంటాడు. సోమవారం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పట్టాలు దాటుతున్న సమయంలో విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే పాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలకృష్ణకు భార్య చిన్నమ్మి, ఇద్దరు పిల్లలున్నారు. రైల్వే హెచ్‌సీ వి.ఎన్.మూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోటదుర్గకు పూజలు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మను సోమవారం కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.



తల్లి సేవలో కలెక్టర్ తదితరులు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ఈ గుర్తుకే మొగ్గు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థకు సంబంధించి ప్రత్యేక లోగో కోసం ఇటీవల అధికారులు ఔత్సాహికులను కోరగా.. పెద్దఎత్తున స్పందించారు. వారు పంపిన వాటిల్లో నాలుగు లోగోలను ఎంపిక చేశారు. వాటిల్లో అందరికీ నచ్చిన దానిని తెలియజేయాలని కోరగా.. రెండో నంబరు లోగోను 2,312 మంది, మొదటి దానిని 40 మంది, మూడు- 282, నాలుగో లోగోను 20 మంది ఇష్టపడ్డారని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి.. త్వరలో తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని చెప్పారు.

లయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం



అవార్డు అందజేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ గోపాలరావు

గరివిడి, న్యూస్‌టుడే: లయన్స్ జిల్లా (విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అరకు, తూర్పుగోదావరి) పరిధిలో పనిచేస్తున్న 68 క్లబ్‌లలో శ్రీరాం నగర్(గరివిడి) ఉత్తమ క్లబ్‌గా ఎంపికైంది. ఆదివారం రాత్రి విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ జిల్లా 316ఎ ప్రాంతీయ సదస్సులో లయన్స్ పీఐడీ విజయకుమార్‌రాజు, జిల్లా గవర్నర్ గోపాలరావు ఈ అవార్డును సంబంధిత ప్రతినిధులకు అందజేశారు. ఈ ఏడాది క్లబ్ అంతర్జాతీయ నిధికి 23 వేల డాలర్ల నిధులు సేకరించి ఇవ్వడంతో పాటు శ్మశానవాటిక అభివృద్ధి, పచ్చదనం పెంపునకు విరివిగా మొక్కలు నాటడం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎంఎస్ఎస్ శర్మ, టి.కమలాకరరావు అంతర్జాతీయ లీడర్ షిప్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శిగా ప్రసాద్, ఉత్తమ జిల్లా ఛైర్మన్లుగా కమలాకరరావు, రామకృష్ణ, రవి.. రెండవ ఉత్తమ ప్రెసిడెంట్‌గా ఎస్‌వీఎల్ఎన్.రాజు, కోశాధికారిగా మహేష్ నిలిచారు.

నగరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విజయనగరంలో వచ్చేనెల 27 నుంచి 30 వరకు జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటికి పరిష్కారం లభించేలా కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మహాసభల ప్రారంభం రోజున జరిగే భారీ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆలిండియా నాయకులు రానున్నారన్నారు. జిల్లా కార్యదర్శి నాగభూషణం, సహాయ కార్యదర్శి గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జాన్సన్‌బాబు, విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి కృషి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జగదీశ్వరి పేర్కొన్నారు. నియోకవర్గంలోని ఐదు మండలాల్లోని పలు గ్రామాల నుంచి వచ్చిన పలువురు ఆమెకు సమస్యలపై అర్జీలు అందజేశారు. అనంతరం నాయకులతో ఎమ్మెల్యే సమావేశమై మాట్లాడారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండల కన్వీనర్ పి.సుదర్శనరావు, నాయకులు లక్ష్మణరావు, శాంతకుమార్, జనార్దనరావు, రవి తదితరులు ఉన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జగదీశ్వరి

సేవానిరతికి మారుపేరు శంకరన్

పార్వతీపురం, న్యూస్‌టుడే: అఖిలభారత పాలనా రంగంలో సేవానిరతికి మారుపేరుగా నిలిచిన అరుదైన వ్యక్తి ఎస్.ఆర్.శంకరన్ అని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం శంకరన్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి ఐఏఎస్ అధికారులు నివాళులర్పించారు. పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమం లో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు

ఉత్తమ ప్రతిభకు పురస్కారాలు

సీతంపేట, న్యూస్‌టుడే: నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో సంపూర్ణ అభియాన్ ముగింపు కార్యక్రమం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన భామిని మండలానికి చెందిన అధికారులు, ఉద్యోగులను పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. భామిని ఎంఈవో ఎ.శ్రీనివాసరావు, సీడీపీవో శాంతిభవాని, ఏవో సింహాచలం, వైద్యులు పి.సోయాల్, దీపికారాణి, దామోదరరావు, ఏపీఎం భవాని, బ్లాక్ సమన్వయకర్త కె.మహేశ్వరరావు తదితరులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర, డీడీఈవో పి.నారాయుడు తదితరులు పాల్గొన్నారు.


పీవోతో ప్రశంసాపత్రాలు అందుకున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పార్వతీపురంలోని లింగంవీధి సమీప కాలువలో చెత్త పేరుకుపోతోంది. వర్షం పడితే కాలనీ జలమయం అవుతోంది. **- ఎం.శ్రీను**

● కాలువను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- పకీరు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – న్యూస్‌టుడే, బెలగం

? పాలకొండ ఆంజనేయకాలనీలో కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయి. **- మూర్తి, విద్యార్థి**

● పూడిక తొలగించి శుభ్రం చేయిస్తాం. **- దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? బడేవలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల వర్షాలతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. **- గ్రామస్థులు**

● రహదారి విషయంపై అధికారులు, సర్పంచితో చర్చించాం. **- గణేష్, కార్యదర్శి** – న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం

? పార్వతీపురంలోని బోటు వీధి కూడలి వద్ద రోజుల తరబడి చెత్త నిల్వ ఉండిపోయింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- బి.గంగాధర్, స్థానికుడు.**

● సిబ్బంది సరిపడా లేరు. చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- పకీరు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.** – న్యూస్‌టుడే, బెలగం

పరిష్కార వేదికకు 42 అర్జీలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు హాజరై వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 42 అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను పీవో ఆదేశించారు. ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి

పాలకొండ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలపై పనిభారం తగ్గించాలని పాలకొండ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జెస్సీబాయి, బి.అమరవేణి కోరారు. ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో వివరాల నమోదుతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

ఆహ్లాద వాతావరణం.. ఆరోగ్యకర పంటలు

❖ రెండేళ్లుగా పండిస్తున్న సిబ్బంది
❖ ఆదర్శంగా గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పెరుగుతున్న కూరగాయల ధరలు ఓ వైపు సామాన్యుల నడ్డి విరుస్తుంటే.. రసాయన ఎరువులు మరో వైపు ప్రజల ఆరోగ్యాన్ని పీడిస్తున్నాయి. ఇలాంటి వాటి నుంచి విద్యార్థులను దూరం పెడుతూ.. ఆహ్లాదకర వాతావరణంలో పంటలు పండిస్తున్నారు గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థినులు. ప్రిన్సిపల్ శ్రీరంజని ఆధ్వర్యంలో రెండేళ్లుగా ఉన్న కొద్దిపాటి స్థలంలోనే సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ ఆర్థిక భారాన్ని తగ్గించుకుంటున్నారు.


బెండకాయలు సేకరిస్తున్న విద్యార్థినులు

శాస్త్రవేత్తల సూచనలతో..

రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాలతో మొక్కలకు నీటి తడులు అందిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. కలుపు నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఖాళీ సమయాల్లో విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని రకాల కూరగాయలు..

పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలాన్ని రూ.1500 ఖర్చు చేసి చదును చేయించారు. జట్టు సంస్థ అందించిన విత్తనాలతో పాటు సుమారు రూ.600 వెచ్చించి బెండ, వంగ, మొక్కజొన్న, దొండ, చిక్కుడు, బీర, కంది, మిరప, ఆనప, ఆకుకూరల విత్తనాలు కొనుగోలు చేశారు. ఒక్కో రకం పంటకు ఒక్కో బెడ్డు తయారు చేసి విత్తనాలు వేశారు. వీటితో పాటు అరటి, బొప్పాయి చెట్లు నాటారు. పశువుల ఎరువు మాత్రమే వినియోగిస్తున్నారు.


కూరగాయలు చూపుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

రెండు రోజులకు 4 కిలోల బెండ..

పాఠశాల ఆవరణలో పండే తాజా కూరగాయలను మాత్రమే విద్యార్థులకు వండి పెడుతున్నారు. రెండు రోజులకు ఒకసారి సుమారు 4 కిలోల బెండ, కిలో వంగ, రోజూ 3 కిలోల గంగూర సేకరించి సాంబారు వండుతారు. బొప్పాయి పండ్లను విద్యార్థులకు ఇస్తారు. ఒక పంట పూర్తవగానే ఖాళీగా ఉంచకుండా వేరే విత్తనాలు వేస్తారు. దీంతో తెగుళ్ల బెడద తగ్గుతుంది.

ఆవరణలో పూలు.. వరండాల్లో కుండీలు..

పచ్చదనం, పరిశుభ్రత కేవలం పాఠంగా బోధించి సరిపెట్టడం లేదు. వాటి గురించి విద్యార్థులు అనుభవ పూర్వకంగా తెలుసుకునేలా పాఠశాల ఆవరణలో బంతి, చామంతి, గులాబి, మందారంలాంటి పూల మొక్కలు నాటారు. గేటు లోపలికి అడుగు పెట్టగానే దారికి ఇరువైపులా అందగా ఉన్న పచ్చని చెట్లు, మొక్కలతో ఆవరణ కళకళలాడుతోంది. కుండీల్లో మొక్కలు నాటి వరండాల్లో సైతం ఏర్పాటు చేశారు.

అందరి సమన్వయంతో..

పాఠశాలలో ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థుల సమన్వయంతోనే కూరగాయలు, ఆకుకూరలు, పూల మొక్కలు పెంచుతున్నాం. రసాయన ఎరువుల వినియోగంతో పంటలు కల్తీ అవుతున్నాయి. ఈ తరుణంలో సేంద్రియ పద్ధతులపై విద్యార్థులకు వివరిస్తున్నాం. తాజా కూరగాయలను వంటల్లో వినియోగిస్తున్నాం.

– సీహెచ్ శ్రీరంజని, ప్రిన్సిపల్

అధికారుల కొరత.. సేవలకు అంతరాయం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం.. ప్రథమ స్థాయి పురపాలక సంఘం పార్వతీపురంలో అధికారుల కొరత ఏర్పడింది. కీలకమైన అధికారులు లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కమిషనరుగా బాధ్యతలు నిర్వహించిన కోన శ్రీనివాస్ రాష్ట్ర సచివాలయానికి బదిలీ కావడంతో వెళ్లిపోయారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం నుంచి రావాల్సిన అధికారి విధుల్లో చేరకపోవడంతో ఇన్‌ఛార్జి అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంజినీరింగు విభాగంలోని డీఈ, ఏఈలకు బదిలీ అయ్యింది. జీవీఎంసీకి ఏఈ వెళ్లిపోయారు. డీఈ సెలవులో ఉన్నారు. వీరి స్థానంలోనూ ఎవరూ రాకపోవడంతో ఇంజినీరింగ్ విభాగం ఏఈతో నడుస్తోంది. ఆయనే ఇన్‌ఛార్జి కమిషనర్‌గానూ ఉన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారికి బదిలీ అయినా ఆ స్థానంలో ఎవరూ విధుల్లో చేరకపోవడంతో చాలా విభాగాలు ఖాళీగా మారాయి.



పార్వతీపురం పుర కార్యాలయం

నిలిచిన మరణ, జనన ధ్రువపత్రాల జారీ..

పురపాలనను నడిపించాల్సిన కమిషనరు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాగునీటి సరఫరా పర్యవేక్షించే ఏఈ లేకపోవడంతో తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతోంది. ఈ విభాగాన్ని సచివాలయ ఇంజినీరింగు కార్యదర్శికి అప్పగించారు. అత్యవసర పరిస్థితిల్లో ఆర్థికంగా ఆయన ఏమీ చేయలేని పరిస్థితి. పురపాలక సంఘానికి ఆదాయం సమకూరే పట్టణ ప్రణాక విభాగం అధికారి బదిలీతో ఆర్థిక పరమైన లావాదేవీల విషయంలో ముందుకు వెళ్లలేకపోతున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు అంతరాయం కలుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ఏ ఖాతాలో నిధులున్నా ఖర్చు చేసే అవకాశం లేకుండా పోయింది. కార్యక్రమాల పర్యవేక్షణలోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. సుమారు 112 వరకు దరఖాస్తులు పుర కార్యాలయంలో ఉండిపోయాయి. పురపాలికలో సమస్యలపై ఇన్‌ఛార్జి కమిషనర్ సన్యాసిరావు వద్ద ప్రస్తావించగా.. మూడు నాలుగు రోజుల్లో అధికారులు విధుల్లో చేరే అవకాశం ఉందని తెలిపారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి జె.సౌమ్య జోస్ఫిన్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కురుపాం కోర్టు ఆవరణలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలు రూపొందించినట్లు చెప్పారు. రిసోర్స్‌పర్సన్లు ఎ.వి.ఎల్.పద్మజ, పి.వి.వరలక్ష్మి, పారాలీగల్ వాలంటీర్లు కోటేశ్వరరావు, మహేశ్వరి, విజయలక్ష్మి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి జె.సౌమ్యజోస్ఫిన్

రైల్వే లైను కోరుతూ లక్ష సంతకాలు

పాలకొండ, న్యూస్‌టుడే: విజయనగరం నుంచి పాలకొండ మీదుగా రైల్వే లైను ఏర్పాటు చేయాలని కోరుతూ లక్ష సంతకాల సేకరణను సోమవారం ప్రారంభించారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టంకాల దుర్గారావు ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు, ప్రధాన కూడళ్లలో సంతకాలు సేకరించారు. జిల్లా ప్రజల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.


బస్సు నిలయంలో అవగాహన ర్యాలీ


నక్కలపేటలో విగ్రహాలకు పూజలు


చినమేరంగిలో తమలపాకుల అలంకరణ


సీతానగరంలో నగదుతో..

మహాశక్తి రూపిణీ.. పాహిమాం

న్యూస్‌టుడే, బృందం: జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బలిజిపేట మండలంలోని అజ్జాడలో మహాచండీ రూపంలో దర్శనమిచ్చారు. కురుపాం మండలంలోని రావాడలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగిలో 1008 తమలపాకులతో అలంకరించారు. పార్వతీపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. బైపాసు రోడ్డులోని ఉమారామలింగేశ్వర ఆలయంలో పార్వతీదేవికి గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.

కలుషిత నీరు మళ్లింపు

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండంలోని విశ్వనాథపురంలో అతిసారం విజృంభించడంతో ఇటీవల ఇద్దరు మరణించారు. మరికొందరు తీవ్ర అనారోగ్యం బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. ఈ పరిస్థితికి తాగునీరే కారణమని అధికారులు తేల్చారు. సమీప వేగావతి నదిలో ఏర్పాటు చేసిన ఇన్‌ఫిల్టర్ బావి ద్వారా సరఫరా అయిన నీరు కలుషితమైందని చెప్పారు. దీంతో సోమవారం క్లోరిన్ వేసి బావిని శుభ్రం చేశారు. పైపుల లీకులను సైతం అరికట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డి, జేఈ రామాంజనేయులు తెలిపారు.

ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

భామిని, గరుగుబిల్లి, వీరఘట్టం, సీతంపేట, న్యూస్‌టుడే: పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తే పంచాయతీల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో చంద్రరావు అన్నారు. భామినిలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. పరస్పర అవగాహనతో పనులు చేపట్టాలన్నారు. ● గరుగుబిల్లిలో ఎంపీపీ రామారావు, ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ గోపాలరావు, వీరఘట్టంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఎంపీపీ వెంకటరమణనాయుడు, సీతంపేటలో ఎంపీపీ బి.ఆదినారాయణ, డీఎల్‌పీవో రాంప్రసాద్, ఎంపీడీవో గీతాంజలి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 53 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య కొట్లాట

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ వివాహ వేడుకలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ రాళ్లు రువ్వుకొనే వరకు వెళ్లింది. ఆదివారం రాత్రి పార్వతీపురం మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చినబొండపల్లిలో పెళ్లి జరుగుతుండగా కొందరి మధ్య తగాదా జరిగింది. మాటామాటా పెరగడంతో రాళ్లు విసురుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడి గొడవ సద్దుమణిగించారు.

116 మందికి కంటి పరీక్షలు

పాచిపెంట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాచిపెంటలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 116 మందికి పరీక్షలు చేశారు. పలువురికి ఉచితంగా మందులు అందించారు. 26 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సంస్థ ప్రతినిధి స్వామినాథం తెలిపారు.

పొట్టేళ్ల పందేలపై దాడులు

వీరఘట్టం: బిటివాడ సమీపంలో జరుగుతున్న పొట్టేళ్ల పందేలపై హెచ్‌సీ రవిశేఖర్, కానిస్టేబుళ్లు గోపాల్, రవి, గోవింద దాడులు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని, కారు, పొట్టేళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాధ్యతల స్వీకరణ

సీతానగరం: సీతానగరం తహసీల్దారుగా ప్రసన్నకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. ● భామిని: భామిని ఏపీఎంగా మీసాల చక్రపాణి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన డి.భవాని రాజాం వెళ్లారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి

పార్వతీపురం పట్టణం, పురపాలక: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురంలో జరిగింది. జగన్నాథపురానికి చెందిన ఎన్.గణేష్ (35) రాయగడ రోడ్డులో నడిచి వెళ్తుండగా డంపింగ్ యార్డు సమీపంలో వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన ఆయనను విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని పట్టణ పోలీసులు తెలిపారు.

పీఏసీఎస్ పరిశీలన

సాలూరు గ్రామీణం: శివరాంపురంలోని పీఏసీఎస్‌ను నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. సీఈవో హరీష్ తదితరులు ఉన్నారు.

పట్టాలు ఇవ్వాలని వినతి

పాచిపెంట: మోదుగ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. సోమవారం పాచిపెంటలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దారు రవికి వినతి అందజేశారు.

గోరటిలో వైద్యశిబిరం


గుమ్మలక్ష్మీపురం: పెదఖర్జ పంచాయతీలోని గోరటిలో రాఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రవికుమార్ గ్రామస్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

తెదేపా నాయకుల ఔదార్యం

కొమరాడ: పొడుగువలస నుంచి ఒడిశాలోని వేంపల్లవలస సరిహద్దు వరకు 2 కిలోమీటర్ల పొడవున మట్టిరోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. తెదేపా ఎస్టీ సెల్ ప్రతినిధి బలరాం స్పందించి యంత్రం సాయంతో గోతులు పూడ్చారు.

సాగునీటి ప్రాజెక్టుల పనులకు డిమాండు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు కోరారు. సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. జంఝావతి, వంశధార, తోటపల్లి, రామతీర్థసాగరం లాంటి ప్రాజెక్టులు ఉన్నా సాగు నీరు అందక జిల్లా రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈనెల 22న అనకాపల్లిలో జరగనున్న ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ నాయకులు టి.జీవన్న, జి.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు